క్లుప్తంగా

ఉచితంగా కృత్రిమ అవయవాలు

నారాయణవనం: దివ్యాంగులకు కృత్రిమ జైపూర్ అవయవాలను ఉచితంగా అందజేస్తున్నట్లు లక్కీస్ చారిటబుల్ ట్రస్ట్ పేర్కొంది. ట్రస్ట్ చైర్మన్ సాయిరాం మాట్లాడుతూ పుట్టుకతో లేదా ప్రమాదంలో అవయవాలను కోల్పోయిన దివ్యాంగులకు ట్రస్ట్ తరఫున ఉచితంగా జైపూర్ కృత్రిమ అవయవాలను అమర్చుతామని అన్నారు. కృత్రిమ అవయవాలకు ట్రస్ట్ ప్రతినిధి వంశీని 77290 44987 నెంబర్‌లో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

వెంకన్న సేవలో ఎమ్మెల్సీ


వెంకన్న ఆలయంలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణవనం: శ్రీపద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామిని శనివారం వైఎస్సార్ సీపీ నెల్లూరు ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి దర్శించుకున్నారు. స్వామివారి ఆర్జిత కల్యాణోత్సవంలో పాల్గొన్న చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో తీర్థ ప్రసాదాలను అందజేశారు. మండల పార్టీ నాయకులు హేమచంద్రారెడ్డి, వరదారెడ్డి దర్శన ఏర్పాట్లు చేశారు. కుటుంబ క్షేమంతో పాటు పార్టీ క్షేమాన్ని కోరుతూ వెంకటేశ్వరస్వామిని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు.

పాఠశాల స్థలం ఆక్రమణపై నిరసన


తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తహా నగర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన స్థలం ఆక్రమణను అడ్డుకోవాలని శనివారం గ్రామస్తులు స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో ఉన్న భూమి ఇదే గ్రామానికి చెందినవారి ఆక్రమించుకున్నారని తెలిపారు. పాఠశాల స్థలంలోని కంపను తొలగించాలని అడిగితే గొడవకు వస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి పాఠశాల భూఆక్రమణను అడ్డుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

శ్రీకాళహస్తి: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మన సంస్కృతి కళాజాతా బృందం ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణంలో శనివారం నాటక ప్రదర్శన చేశారు. హెచ్ఐవీ ఎలా వస్తుంది. ఎలా వ్యాప్తి చెందుతుంది? రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అనే దానిపై తమ ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్టెప్స్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజరు భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


కేవీబీపురం ఎంపీడీఓ మాలతి

కేవీబీపురం: యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీఓ మాలతి పేర్కొన్నారు. ఆమె శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జూన్ 21 వరకు అన్నిశాఖల అధికారులు యోగాంధ్ర దిశగా ప్రతిరోజూ యోగాసనాలను కార్యాలయాల వద్ద నిర్వహించాలని కోరారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని ఆమె కోరారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీనివాస్

శ్రీకాళహస్తి: పట్టణంలోని పానగల్‌వద్ద గల హజరత్ జునలేషా పీర్ దర్గాలో శనివారం తిరుపతి జిల్లా ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక విభాగం ఎస్పీ శ్రీనివాస్ ప్రత్యేక ప్రార్థనలు చేసుకున్నారు. ఆయనకు దర్గా నిర్వాహకులు స్వాగతం పలికారు. దర్గాలో ప్రార్థనలు అనంతరం ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాబా ఫరీద్, నాగేశ్వరరావు, అన్సర్, ఇమామ్, మౌలానా, యాకూబ్, రహీంఖాన్, బావాజాన్ పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదం!



గ్రామీణ ప్రాంతాల్లో పలు రోడ్లు కంకర తేలిపోవడంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. సత్యవేడు మండలంలోని మాదనపాళెం, వరదయ్యపాళెం, గోపాలరావుకాలనీ, వడ్డిపాళెం, కురింజల్లం, ముస్లింపాళెం, లక్ష్మీపురం, కే పులివల్లం, పెద్ద పాండూరు-సిద్ధాపురం వెళ్లే రోడ్డు మార్గాలు అధ్వాన్నంగా ఉన్నాయి. ప్రధానంగా ఈ మార్గాల్లో గత ప్రభుత్వంలో సిమెంటు రోడ్ల నిర్మాణం కోసం వెట్‌మిక్స్ లేయర్ వరకు పనులు చేపట్టారు. అయితే ఎన్నికల కారణంగా అర్థంతరంగా నిలిపివేశారు. ప్రస్తుతం ఆ రోడ్ల పరిస్థితి కంకర తేలి దారుణంగా మారింది. కూటమి ప్రభుత్వం సంబంధిత రోడ్ల అభివృద్ధిపై స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. -వరదయ్యపాళెం

పేరుకున్న పూడిక

- తెలుగుగంగ బ్రాంచ్ కెనాల్‌లో సాగని నీటి ప్రవాహం


పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న తెలుగుగంగ 9వ బ్రాంచ్ కాలువ

వరదయ్యపాళెం: తెలుగుగంగ ఉప కాలువలో పూడిక పేరుకుపోవడంతో ఆ కాలువలో నీటి ప్రవాహం కష్టతరంగా మారుతోంది. మండలంలోని చిన్న పాండూరు మీదుగా మాంబట్టుకు వెళ్లే తెలుగుగంగ 9వ బ్రాంచ్ కాలువ పూర్తిగా పిచ్చి మొక్కలు, వ్యర్థాలతో కమ్ముకుపోయింది. దీంతో ప్రధాన కాలువ నుండి రైతుల అవసరాల కోసం ఉపకాలువకు నీటిని విడుదల చేసిన సమయంలో కాలువలో నీరు సాఫీగా సాగడం లేదు. ఎక్కడికక్కడ కమ్ముకున్న పిచ్చి మొక్కలు, చెట్ల పొదలు అడ్డు తగులుతున్నాయి. 2004–2005 సమయంలో ఈ కాలువను తవ్వారు. అప్పటి నుండి నేటి వరకు కాలువ బాగోగులపై సంబంధిత తెలుగుగంగ అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఈ కాలువ పరిధిలో వరదయ్యపాళెం మండలం సంబంధించి దాదాపుగా 15 చెరువుల వరకు సాగునీరు పారాల్సి ఉంది. రైతులకు ఎంతో అవసరమైన గంగ ఉపకాలువపై నిర్లక్ష్యం చూపడమేమిటని రైతులు ఆ శాఖా అధికారులను ప్రశ్నిస్తున్నారు. కాలువ పూర్తిగా పూడికతీత పనులు చేపట్టి అభివృద్ధి చేయాలని, తద్వారా సాఫీగా నీటి పారుదల జరుగుతుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ కాలువపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఉపాధిలో పూడిక తీయాలి

ప్రస్తుత వేసవిలో జరుగుతున్న ఉపాధి పనులకు సంబంధించి కాలువ ప్రాంతంలో ఉన్న ఆయా గ్రామాల పరిధిలోని కూలీల ద్వారా తెలుగుగంగ ఉపకాలువలో పూడికతీత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. వృథాగా అవసరం లేని చోట పనులు నిర్వహించకుండా రైతుల సాగునీటి అవసరాల కోసం ఎంతో ఉపయోగపడే కాలువ అభివృద్ధికి తోడ్పడాలని కోరుతున్నారు. దీనిపై ఉపాధి హామీ అధికారులు స్పందించి పూడికతీత పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరుతున్నారు.

బాల్య వివాహం సాంఘిక దురాచారం


మాట్లాడుతున్న సర్పంచ్ మోహనప్రియ

ఏర్పేడు: బాల్య వివాహం సాంఘిక దురాచారమని, దానిని రూపుమాపేందుకు అందరూ కలసికట్టుగా పని చేయాలని ఎండీ పుత్తూరు సర్పంచ్ కందాటి మోహనప్రియ కోరారు. మండలంలోని ఎండీ పుత్తూరు గ్రామ సచివాలయంలో సర్పంచ్ కందాటి మోహన్ ప్రియ ఆధ్వర్యంలో శనివారం గ్రామ స్థాయి బాలల రక్షణ కమిటీ సభ్యులకు, సచివాలయ సిబ్బందికి బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థలపై అవగాహన కల్పించారు. చిన్న వయసులో బాల్యవివాహాలు చేసుకోవడం వల్ల కలిగే నష్టాలను తెలియజేశారు. గ్రామంలో ఎవరైనా బాల్యవివాహాలు చేస్తున్నట్లు తెలిసిస్తే 1098కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భువనేశ్వరి, హెల్త్ సూపర్వైజర్ మంజుల, ఏఎన్ఎం లలిత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారం


తహసీల్దార్ సుధీర్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎంపీడీఓ ప్రసాద్

వరదయ్యపాళెం: రెవెన్యూ, మండల పరిషత్ శాఖల సమన్వయంతో మండలంలోని ప్రజల సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి చొరవ చూపుతామని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ సుధీర్‌రెడ్డి తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌ను ఎంపీడీఓ ప్రసాద్, ఈఓపీఆర్డీ చిరంజీవి శనివారం గౌరవపూర్వకంగా కలసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండు శాఖల సమన్వయంతో అటు అభివృద్ధి పనులు, ఇటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రత్యేక చొరవ చూపుతామని తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

రేణిగుంట: మండలంలోని కేఎల్ఎం హాస్పిటల్ కూడలిలో శనివారం మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని గాజుల మండ్యం పోలీసులు అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 16 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిబంధనలు బేఖాతర్


రేణిగుంటలోని మద్యం దుకాణంలో ఉదయం 9:40 గంటలకు మద్యం విక్రయిస్తున్న దృశ్యం

రేణిగుంట: రాష్ట్ర ప్రభుత్వం మద్యం అమ్మకాల సమయాల్లో నిబంధనలు మాత్రం అమలు కావటం లేదు. పట్టణంలోని పారిశ్రామిక వాడలో శనివారం ఉదయం 9:40 గంటలకు మద్యం షాపును తెరిచి అమ్మకాలు జరుపుతున్నారు. ఉదయం పది గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం అమ్మకాలు కొనసాగించాలి. కానీ మద్యం దుకాణాలు కూటమి నాయకులకు చెందినవి కావడంతో విచ్చలవిడిగా అమ్మకాలు కొనసాగిస్తున్నారు. దీనిపై ఎక్సైజ్ శాఖ సిఐ నరస నాయుడును వివరణ కోరగా అన్ని మద్యం షాపులు ఉదయం 10 గంటలకు తెరిచి రాత్రి 10 గంటలకు మూసి వేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కడివేడులో బెల్టు షాపుపై దాడి

నాగలాపురం: మండలంలోని కడివేడు గ్రామంలో అక్రమంగా బెల్టు షాపులో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ షణ్ముగం తెలిపారు. కడివేడు గ్రామంలో ఓ బెల్టు షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు శనివారం రాత్రి దాడి నిర్వహించి బెల్టు షాపు నిర్వాహకుడు రంగయ్యను మద్యం విక్రయిస్తుండగా సంఘటన స్థలంలో అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి బెంగళూరు బ్రాందీ 10 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శాస్త్రోక్తంగా ప్రదోష నందిసేవ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రదోష నందిసేవ శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు పలు రకాల పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించి ప్రదోష నందిపై అధిష్టింపజేశారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్యం.. పరమ అధ్వాన్నం


తారురోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు


రోడ్ల పక్కన నిల్వ ఉన్న మురుగునీరు

వరదయ్యపాళెం: మండలంలోని తొండంబట్టు గ్రామంలో పారిశుధ్య లేమితో స్థానికులు సతమతమవుతున్నారు. ప్రధానంగా మురుగునీటి కాలువలు లేని కారణంగా స్థానికులు నడిచే రోడ్ల మీద, రోడ్ల పక్కన మురుగునీటి నిల్వలు చేరుతున్నాయి. దీంతో దోమలు విస్తరించి స్థానికులు అనారోగ్యం పాలవుతున్నారు. ఏకంగా రోడ్ల మీదే నీటి నిల్వలు చేరడంతో అటువైపు కాలినడకన వెళ్లే పాదచారులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ప్రధాన రోడ్ల పైనే దారుణంగా మురుగునీటి నిల్వలు చేరుతున్నప్పటికీ సంబంధిత పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. వంద ఇళ్లకు పైగా ఉన్న ఈ గ్రామంలో రోడ్ల వెంబడే మురుగునీటి నిల్వలు చేరుతున్నాయి. ప్రధానంగా ఇళ్ల వద్ద నుండి వచ్చే వ్యర్థపు నీటిని సైతం రోడ్లపైకి వదిలేస్తుండడంతో గ్రామమంతా మురుగునీటితో కలుషితమై అపరిశుభ్రంగా మారింది. అధికారులు స్పందించి, పారిశుధ్య పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

యయాతిరాజు జయంతి

సత్యవేడు: పంచాయతీ పరిధిలోని అచ్చల మఠంలోని శ్రీభూపతేశ్వర ఆలయ ప్రాంగణంలో ముదిరాజ్ కులస్తుల పితామహుడు యయాతి రాజు జయంతి వేడుకలు రెండు రోజులు ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సేవా సంఘం మండల అధ్యక్షుడు మురళి(చికెన్ చిన్నా) ఆధ్వర్యంలో పలువురు ముదిరాజ్ సేవా సంఘం సభ్యులు, కులస్తులు యయాతిరాజు జయంతి శుక్ర, శని వారాలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. యయాతిరాజు చేసిన సేవలను స్మరించుకొన్నారు. ఈ సందర్భంగా మండలంలో ముదిరాజ్ సంఘం చేపట్టిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో శివయ్య, వెంకటేశ్వర్లు, రాము, జగన్, రామారావు, పరంధామయ్య, నాగరత్నం, రేవతి తదితరులు పాల్గొన్నారు.

టెండర్లు పిలవండి

వరదయ్యపాళెం: పిచ్చాటూరు మండలం ముడియూరులో నూతనంగా మంజూరైన 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు సంబంధించి తక్షణమే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం విన్నవించారు. విద్యుత్‌శాఖ సీఎండీ సంతోష్‌రావును శనివారం తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. తక్షణమే టెండర్ ప్రక్రియను సిద్ధం చేయాలని కోరారు. దీనిపై సీఎండీ సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రజాదర్బార్

శ్రీకాళహస్తి: పట్టణంలోని పీఆర్ అతిథి గృహంలో శనివారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు పలు సమస్యలపై ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వాటికి త్వరితగతిన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

వైభవంగా శని త్రయోదశి పూజలు



ప్రదోష మండపంలో నందీశ్వరునికి పూజలు, శని త్రయోదశి పూజల్లో పాల్గొన్న భక్తులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా భాసిల్లుతున్న శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో శనివారం శని త్రయోదశి ప్రదోష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం రోజు త్రయోదశి పర్వదినం రావడం విశేషం కావడంతో ఆలయంలో శివునికి, మరగదాంబిక అమ్మవారికి ఏకకాలంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ శని త్రయోదశి ప్రదోష పూజలకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్ ఆలయంలోని ప్రదోష మండపంలో నందీశ్వర స్వామికి, శ్రీ వాల్మీకీశ్వర స్వామికి ఏక కాలంలో పూజలు నిర్వహించారు. ఈ ప్రదోష పూజలకు నింద్ర గ్రామానికి చెందిన శ్రీనివాస మిల్క్ డెయిరీ ఎండీ వాసుదేవనాయుడు, వారి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. వారికి ఆలయ మర్యాదలతో దర్శన ఏర్పాట్లు చేసి, ప్రసాదాలు అందించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.లత, ఆలయ సిబ్బంది పరంధామరెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలీస్ అవుట్ పోస్టు మూసివేత


మూసి ఉన్న పోలీస్ అవుట్ పోస్ట్

రేణిగుంట: అసాంఘిక కార్యక్రమాలను అదుపులో పెట్టేందుకు గత ప్రభుత్వంలో తారకరామా నగర్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్టులు ప్రస్తుతం మూసి వేయడంతో పలు విమర్శలు తలెత్తుతున్నాయి. మండలంలోని కరకంబాడి పంచాయతీ తారక రామానగర్‌లో సుమారు మూడు వేల కుటుంబాలు ఉంటున్నాయి. సగానికి పైగా ఇళ్లను అద్దెకు ఇస్తున్నారు. అందువల్ల ఎప్పుడు కొత్త వాళ్ల కదలికలు ఎక్కువగా ఉంటున్నాయి. వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు నివాసం ఉండడం వలన ఎప్పుడు ఏదో ఒక విషయంపై పోలీస్ స్టేషన్‌కు వస్తుంటారు. అందువల్ల గత ప్రభుత్వంలో తారకరామా నగర్ మొదట్లో పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేశారు. నిత్యం పోలీసులు అక్కడ అందుబాటులో ఉండడంతో స్థానికులు నిశ్చింతగా ఉండేవారు. చిన్న చిన్న గొడవలు, సమస్యలన్నీ అవుట్ పోస్ట్ లో పరిష్కారమయ్యే ఉండేవి. కానీ ప్రస్తుతం అవుట్ పోస్టును మూసివేశారు. పోలీసులు లేకపోవడం వలన అసాంఘిక కార్యక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయని, సాయంత్రం అయితే మందుబాబులు మద్యం మత్తులో రోడ్ల పైన వెళ్లే వారిని ఇబ్బందులు పెడుతున్నారని స్థానికులు అంటున్నారు. అవుట్ పోస్ట్‌లో సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు. రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్రను వివరణ కోరగా సిబ్బంది బందోబస్తు డ్యూటీల్లో ఉండటం వలన అవుట్ పోస్ట్‌లో సిబ్బందిని నియమించలేకపోతున్నామని, రెండు రోజుల్లో సిబ్బంది వచ్చిన వెంటనే ఇద్దరు నిరంతరం డ్యూటీలో ఉండే విధంగా చూస్తామని అన్నారు.

వేడుకగా ఊంజల్ సేవ


ఉయ్యాల సేవలో ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న

నారాయణవనం: శ్రీపద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం దేవేరులకు ఉయ్యాల సేవను నిర్వహించారు. సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్య పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుండి భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. సాయంత్రం కైంకర్యాలను పూర్తి చేసిన అర్చకులు తిరుచ్చి వాహనంపై శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామిని అధిష్టింప చేశారు. ఊంజల్ మండపంలో గంట పాటు నిర్వహించిన ఊయ్యాల సేవలో ఉత్సవ మూర్తులను భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, అర్చకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం


ఏర్పేడు మండలం రాజులపాళెం ఎస్టీ కాలనీలో అవగాహన కల్పిస్తున్న శిరీష


శ్రీకాళహస్తి మండలం కొత్తూరులో మాట్లాడుతున్న చంద్రశేఖర్

ఏర్పేడు: పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని ప్రగతి సంస్థ మండల సమన్వయకర్త శిరీష అన్నారు. ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం బండారుపల్లి, రాజులపాలెం గిరిజన కాలనీల్లో తల్లిదండ్రులకు పిల్లల పెంపకంపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారని, పిల్లలకు క్రమశిక్షణతో సమాజం మెచ్చే పౌరులుగా తీర్చిదిద్దటానికి పాటించాల్సిన మెలకువలను వివరించారు. వెంకటేష్, మురగయ్య తదితరులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తి మండలం కుంటిపూడి పంచాయతీ కొత్తూరులో ప్రగతి మండల కన్వీనర్ చంద్రశేఖర్ పాల్గొని తల్లిదండ్రులకు పిల్లల పెంపకంపై అవగాహన కల్పించారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



మధుసూదన్‌కు, శెంజిగరం వేలుకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

తొట్టంబేడు: తొట్టంబేడు మండలం కొమ్మనగుంట మాజీ సర్పంచ్ పార్వతమ్మ కుమారుడు డాక్టర్ మధుసూదన్ శనివారం అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అక్కడికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉన్నం నిర్మల, నాయకులు స్వర్ణమూర్తి, సాదన మున్నా రాయల్, ఉత్తరాజి శరవణకుమార్, కంఠా ఉదయ్‌కుమార్, గణేష్, హరినాథ్‌నాయుడు, వెంకటేశ్వర్లు, గఫూర్, రమేష్, విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రియ బుక్ స్టాల్ అధినేతకు నివాళి

శ్రీకాళహస్తి: పట్టణంలో ప్రియా బుక్ స్టాల్ అధినేత శెంజిగరం వేలు అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి శనివారం ఆయన పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.